# చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

- తిరుపతికి ఐకానిక్‌గా సీవోసీ బిల్డింగ్
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- కాంక్రీట్ పనుల ప్రారంభం



సీవోసీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి తుడా:** తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోతాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్ రెడ్డిలతో కలిసి సీవోసీ (సిటీ ఆపరేషన్ సెంటర్) కాంక్రీట్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.వందల కోట్లతో నగర ప్రజలకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. సీవోసీ బిల్డింగ్ తిరుపతి నగరానికి ఐకానిక్‌గా నిలిచిపోతుందన్నారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించి ప్రజల రుణం తీర్చుకుంటున్నానన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ రూ.80 కోట్లతో సీవోసీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ ఎండీ చంద్రమౌళి, డీఈ దేవిక, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలగిరి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భూమన లక్ష్మమ్మకు ఘన నివాళి**

**తిరుపతి మంగళం:** తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాతృమూర్తి భూమన లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం తిరుపతి సుందరయ్యనగర్ వద్ద ఉన్న శ్మశానవాటికలో ఆమె సమాధి వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే భూమన, ఆయన సతీమణి భూమన రేవతి, కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, టౌన్ బ్యాంకు డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు నాదముని, తాలూరి ప్రసాద్ పాల్గొన్నారు.




కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామిని సోమవారం తిరుపతి కంచిమఠంలో రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. అనంతరం స్వామితో మంత్రి పెద్దిరెడ్డి కొంత సేపు చర్చించారు. అనంతరం స్వామి కుంకుమ ప్రసాదాలను మంత్రికి అందజేశారు. స్వామిని కలిసిన వారిలో మంత్రితో పాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్ ఉన్నారు.

– తిరుపతి మంగళం

## సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ప్రజలకు పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి మంగళం:** ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు విరజిమ్మాయని ఎంఆర్‌పల్లి వాసులు తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సోమవారం కార్పొరేటర్ ఈశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్ తిరుపతి 21వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, వారు పొందిన పథకాలు, లబ్ధిని వివరించారు. నాయకులు సుబ్రమణ్యం, హరినాథ్‌రెడ్డి, అనీల్, మనోహర్‌రెడ్డి, మునిబాబు, జీవన్, జయ, బాష, గోపి పాల్గొన్నారు.

## ఖాతాదారులకు సకాలంలో రుణాలు ఇవ్వాలి

**తిరుపతి మంగళం:** ఖాదారుల రికార్డులు సక్రమంగా ఉంటే సకాలంలో రుణాలు ఇవ్వాలని తిరుపతి టౌన్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. ఇళ్లు, బంగారుపై రుణాలు, వసూళ్లపై సమీక్షించారు. బ్యాంకు ఎండీ విజయ భారతి, బ్యాంకు వైస్ ఛైర్మన్ వాసూయాదవ్, డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, ఖాశీం, పోలిరెడ్డి నాగిరెడ్డి, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్‌రాయల్, అనీల్‌రాయల్, బ్రహ్మానందరెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, మాకం చంద్ర, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## శరత్‌బాబుకు రంగస్థలి నివాళి

**తిరుపతి కల్చరల్:** సినీ నటుడు శరత్‌బాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు తెలిపారు. వారు సోమవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ శరత్‌బాబు సుమారు 250 సినిమాల్లో నటించి కథానాయకునిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తెలుగు వారి హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు.

## అర్చకులకు సంభావన



సంభావన అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

**తిరుపతి కల్చరల్:** తాతయ్యగుంట గంగమ్మ జాతరను విజయవంతం చేయడంలో భాగస్వాములైన అర్చకులకు సోమవారం సంభావన బహూకరించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులు, మేయర్ శిరీష హాజరయ్యారు. ఆలయ అర్చకులు నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున, గంగమ్మ విశ్వరూపాన్ని రూపొందించిన విశ్వబ్రాహ్మణ సంఘానికి రూ.25 వేలు, పేరంటాల వేషధారుడు కైకాల కులస్థుడికి రూ.10 వేలు అందజేసి అభినందించారు. ఆలయ ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వెంకటేష్, భారతి, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## నరసింహులుకు డాక్టరేట్



**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ కామర్స్ విభాగపు పరిశోధక విద్యార్థి నరసింహులు డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆయన ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌వి.సుబ్బారెడ్డి పర్యవేక్షణలో యాన్ ఎవల్యూషన్ ఆఫ్ ఇంపాక్ట్ ఆఫ్ మైక్రో క్రెడిట్ ఆన్ జాయింట్ లయబిలిటీ గ్రూప్స్ ఇన్ ఇండియా అనే అంశంపై పరిశోధన చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల:** శ్రీవారిని సోమవారం కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని, తెలంగాణ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఏపీ టూరిజం ఛైర్మన్ వరప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

## ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం

**తిరుపతి తుడా:** స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. ఆమె సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వారంలోపు ప్రతి సమస్యనూ పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.కె.బాబు మాట్లాడుతూ డీ అడిక్షన్ సెంటర్లో చికిత్స తీసుకున్న వారికి మందులు కొరత ఉందని తెలిపారు. వెంకటేశ్వర థియేటర్ రైల్వే గేటుపై ఫుట్ వోవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు.

**నిరుపయోగ వస్తువుల రీ సైక్లింగ్**

ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో ఇస్తే వాటిని రీసైక్లింగ్ చేసి తిరిగి ఉపయోగంలోకి తీసుకువస్తామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం అన్నమయ్య కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మేరీ లైఫ్ స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఈ నెల 15 నుంచి జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం వరకు కొనసాగుతుందన్నారు.

## బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

**తిరుపతి అర్బన్:** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారు సోమవారం సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, రైతు సంఘం, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.